



మొండేటివారివీధిలోని లలితాదేవి ప్రత్యేక అలంకరణ

పోస్టల్‌లో ఇంటి దొంగలు



ఇచ్ఛాపురంలో పోస్టల్ కార్యాలయం

లక్షా.. రెండు లక్షలు కాదు! రూ.2కోట్ల పైనే భారీ స్కాం! సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపారు. 33 మంది సొమ్ము కాజేశారు. ఎవరూ కనిపెట్టలేరని అనుకున్నారు. కానీ ఓ వ్యక్తి ఫిర్యాదుతో.. డొంకంతా కదిలింది. అధికారులు విచారిస్తే ఇంటిదొంగల యవ్వారం బయటపడింది. ఇచ్ఛాపురం పోస్టల్‌శాఖలో జరిగిన ఈ స్కాం శుక్రవారం వెలుగుచూసింది. ఇది తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు.

- రూ.2.86 కోట్ల భారీ కుంభకోణం
- 33 ఖాతాల సొమ్ము పక్కదారి..
- పబ్లిక్ గ్రీవెన్స్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు
- విచారణ చేపట్టిన శాఖ అధికారులు
- ఇచ్ఛాపురం కేంద్రంగా అక్రమాలు
- ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- మరో తొమ్మిదిమంది అనుమానితులు
- సైబర్ నేరగాళ్లకు సహకరించిన వైనం

ఇచ్ఛాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని పోస్టల్ కార్యాలయంలో జరిగిన భారీ కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కార్యాలయంలో 33 మంది ఖాతాదారులకు సంబంధించిన కిసాన్ వికాస్ పత్రాలు (కేవీపీ) బాండ్లు నగదు రూ.2.86 కోట్లు ఆన్‌లైన్ మోసం ద్వారా గల్లంతైంది. ఇందులో కార్యాలయ సిబ్బంది పాత్ర ఉన్నట్లు అధికారుల విచారణలో తేలడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, శ్రీకాకుళం పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ శుక్రవారం ఇచ్ఛాపురంలో పోస్టల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఏజెంట్లను, ఖాతాదారులను పిలిచి బాండ్ల విషయమై ఆరా తీశారు. ఖాతాదారులు లబోదిబోమంటూ తమగోడు వెళ్లగక్కారు. పిల్లల వివాహాలు, ఉన్నత చదువుల కోసం భద్రతగా ఉంటుందని, పోస్టల్‌లో డబ్బులు దాచుకుంటే.. చివరికి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురంలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఇసురు (మిగతా 6వ పేజీలో..)



ఖాతాదారుల పుస్తకాలు పరిశీలిస్తున్న పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

ఆలయాల్లో శ్రావణ శోభ

- మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రావణ లక్ష్మికి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలోని వివిధ దేవాలయల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. శ్రీకాకుళంలోని మొండేటివారివీధిలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో లలితా దేవి సహిత శివకామేశ్వరి లక్ష్మీదేవికి కుంకుమార్చన చేశారు. సంతోషిమాత ఆలయంలో అర్చకుడు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు సంతోషిమాత ఉద్యాపనలు చేశారు. బొందిలీపురంలోని తుల్జాభవానీ ఆలయం, బలగ అయ్యప్పస్వామి ఆలయం, పీఎన్ కాలనీ వరసిద్ధి వినాయక పంచాయతన ఆలయం, నానుబాల వీధిలో విజయదుర్గ, బాకర్‌సాహెబ్‌పేటలో దుర్గామహాలక్ష్మి ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. అలాగే మహాలక్ష్మినగర్ కాలనీలోని కాత్యాయని అమ్మవారికి, నక్కవీధి ఉమా జఠరేశ్వరాలయంలో ఉమాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీకూర్మం దేవాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకూర్మం, అరసవల్లి అభివృద్ధికి చర్యలు

- అవసరమైన సిబ్బందిని నియమిస్తాం
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

గార/ అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు శ్రీకూర్మం, అరసవల్లిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకూర్మం క్షేత్రాన్ని, అరసవల్లి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'వేలాది సంవత్సరాల చరిత్ర ఉన్న శ్రీకూర్మం క్షేత్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రాష్ట్రంలో సింహాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర దేవాలయాలను కేంద్ర పురావస్తుశాఖ ఇంజనీర్ల పర్యవేక్షణలో అభివృద్ధి చేశాం. శ్రీకూర్మం, అరసవల్లి క్షేత్రాలు పరిశీలించి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తాం. ఇటీవల శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత పడిన సంఘటన బాధాకరం. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాల'ని తెలిపారు. అలాగే అరసవల్లిలో డీసీ స్థాయి ఆలయానికి కావలసిన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికి సంబంధించిన అభ్యర్థన పంపాలని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్‌కు ఆదేశించారు. అలాగే మంగళవాయిద్యాలకు సంబంధించి క్షురకులు తమ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. తమకు కేవలం రూ.9వేలు మాత్రమే నెలకు జీతం ఇస్తున్నారని, కుటుంబాలతో బతకడం కష్టంగా ఉందని, కనీస వేతనం ఇప్పించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి.. సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే శ్రీకూర్మంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెండు చెరువులు.. 11 ఎకరాలు

- ఇదీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఆక్రమణల పర్వం
- అధికారుల సర్వే ద్వారా గుర్తింపు
- కుంకుమసాగరంలో అక్రమ నిర్మాణాలు తొలగింపు



పెంటిభద్ర గ్రామ రోడ్డులో ఆక్రమణకు గురైన కుంకుమసాగరం

పలాస, జూలై 25(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని కుంకుమసాగరం, ఎర్రచెరువు ఆక్రమణలపై మునిసిపాలిటీ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. మొత్తం 11 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. కుంకుమసాగరంలో ఉన్న 8 ఎకరాల ఆక్రమణలు తొలగించారు. ఎర్రచెరువులో ఉన్న ఆక్రమణలు తొలగించనున్నారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ హయాంలో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో అనేక కథనాలు ప్రచురితమైనా అప్పట్లో అధికారులు స్పందించలేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు, కాలువలు ఆక్రమణ విషయమై పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారులు మూడు రోజులుగా సర్వే చేస్తున్నారు. పాతజాతీయరహదారి పెంటిభద్ర- జయరామచంద్రపురం గ్రామాల మధ్య ఉన్న కుంకుమసాగరం చెరువును సమగ్ర సర్వే చేశారు. మొత్తం 8 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలు తొలగించారు. ఇంకా మరికొన్ని ఆక్రమణలు ఇక్కడ గుర్తించాల్సి ఉంది. ఇవి ఎవరి చేతిలో ఉన్నాయి, ఎంతకాలం నుంచి వారు అనుభవిస్తున్నారన్నది అధికారులు పరిశీలనలో తేలాల్సి ఉంది.

- కుంకుమసాగరంలో ఆక్రమణలు తొలగించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు గొలుసు చెరువులో భాగంగా ఉంది. ఎక్కువగా నీరు చేరితే ఆయకట్టు అవసరాలకు నీరు వినియోగించడంతో పాటు మిగులునీరు బెండిగెడ్డ వరకూ వెళ్తుంది. మధ్యలో ఆరుకుపైగా చెరువుల్లో నీరు నింపుతోంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న కుంకుమసాగరాన్ని అభివృద్ధి చేయకపోవడంతో ఆక్రమణలు జరిగాయని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కూడా ఆక్రమణలు తొలగించి (మిగతా 6వ పేజీలో..)

ఏపీఈఏపీ సెట్ తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్-2025 తుది విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని సహాయ కేంద్రం సమన్వయకర్త, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈనెల 27 నుంచి 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో పొందుపర్చిన సర్టిఫికెట్లను సహాయ కేంద్రాల్లో ఈనెల 28 నుంచి 30వ తేదీలోగా అందించాలి. ఈ నెల 28 నుంచి 31వ తేదీలోగా వెబ్‌ఆప్షన్ల నమోదు, ఆగస్టు 1న ఆప్షన్లలో మార్పులకు అవకాశం ఉంది. ఆగస్టు 4న సీట్లు కేటాయిస్తారు. 4 నుంచి 8వ తేదీలోగా ఆయా కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందిన విద్యార్థులు కూడా తుది విడత కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చ'ని ప్రిన్సిపాల్ తెలిపారు.



బందరువానిపేట తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

సముద్రం.. అల్లకల్లోలం

శ్రీకాకుళం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల జిల్లాలో శుక్రవారం పలు చోట్ల వర్షం కురిసింది. సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. అలల ఉధృతితో గార మండలం బందరువానిపేట సముద్రతీరం కోతకు గురైంది. అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లలేదు. బోట్లను, నాటు పడవలను ఒడ్డున లంగరువేసి.. వలలను ఒడ్డున.. కొన్ని ప్రాంతాల్లో నీటిలోనే విడిచిపెట్టేశారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌నకు దరఖాస్తులు

అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిషిప్ కోసం జిల్లా పరిధిలో ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి(ఇన్‌చార్జి) హెచ్.అమరసింహుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మేన్, సివిల్ ట్రేడుల అభ్యర్థులు శనివారం నుంచి ఆగస్టు 9వరకు డబ్లుడబ్లుడబ్లు.అప్రెంటిషిప్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆగస్టు 14న ఉదయం 10 గంటలకు విజయనగరంలోని వీటీ అగ్రహారంలో ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జెరాక్స్ కాపీలను కూడా తీసుకుని రావాలి. మరిన్ని వివరాలకు **08922-294906** నెంబర్‌లో సంప్రదించాల'ని ఆయన సూచించారు.

రేపు అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల(ఆర్ట్స్) మైదానంలో ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆగస్టు 9 నుంచి 11 వరకు బాపట్లలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఈ జట్లు పాల్గొంటాయి. ఈ ఎంపికల్లో అండర్-14, 16, 19, 20 సంవత్సరాల బాలబాలికలు పాల్గొనవచ్చు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల షీట్, ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరు కావాల'ని వారు సూచించారు.

పాలకుల మౌనం.. ప్రజలకు శాపం

- నందిగాం మండల ప్రజలకు అగచాట్లు
- పాత డివిజన్‌లోకి చేర్చాలని డిమాండ్
- తాజాగా మంత్రి వర్గ ఉపసంఘంపైనే ఆశలు

8లో



కాలినడకన శివాలయానికి వెళ్తున్న బోల్‌భం దీక్షాధారులు

'బోల్ భం'.. భక్తిభావం

- శివ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు
- శ్రావణ మాసంలో మాలధారణ

6లో

అత్యవసరమైతే నడకే 'మార్గం'

- దారుణంగా కొరారింగి తాళభద్ర రహదారి
- వర్షం పడితే అంతే సంగతులు

6లో



అధ్వానంగా కొరారింగి తాళభద్ర గ్రామ రహదారి

పక్కా ప్రణాళికతో ఎరువుల పంపిణీ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు సంబంధించి రైతులకు పక్కా ప్రణాళికతో ఎరువులు పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో 2400 మెట్రిక్ టన్నుల యూరియా గోదాముల్లో నిల్వ ఉంది. రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలి. శ్లాట్ ప్రకారం కూపన్ పద్ధతిలో పంపిణీ చేయాలి. డీఏపీ, యూరియా, పొటాష్ వంటి ఎరువులపై శాస్త్రీయ అవగాహనతో పాటు అవసరాల మేరకు మూడు దఫాల్లో సరఫరా (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కాలి నడకన శివాలయానికి వెళ్తున్న బోల్‌భం దీక్షాధారులు (ఫైల్)

బోల్ భం.. భక్తిభావం

- శివ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు
- శ్రావణ మాసంలో మాలధారణ



నదీజలాలు సేకరిస్తున్న శివభక్తులు(ఫైల్)

కంచిలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వచ్చిందంటే ఉత్తరాంధ్ర జిల్లాలు... ముఖ్యంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాలు శివనామ స్మరణతో మార్మోగుతాయి. ఓవైపు మహిళలు లక్ష్మీదేవిని పూజిస్తే...మరోవైపు పురుషులు బోల్‌భం దీక్షలు స్వీకరిస్తారు. పరమశివునికి ప్రీతికరమైన శ్రావణ మాసంలో శివమాలలు ధరించి... పవిత్ర నదుల్లో స్నానమాచరించి... ఆ నీటితో శివలింగాన్ని అభిషేకిస్తే మనసులోని కోరికలన్నీ నెరవేరుతాయని ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. శ్రావణ మాసం ప్రారంభమైన తొలి రోజు అంటే శ్రావణ శుద్ధ పాడ్యమి నుంచి శివమాలలు ధరించి, దీక్షలు చేపడతారు. ఈ దీక్షలకు బోల్‌భం దీక్షలుగా పిలుస్తారు. ఏటా వేలాది మంది భక్తులు ఈ మాలలు ధరించి పరిసర ప్రాంతాల్లో భక్తి ప్రపత్తులను పెంపొందిస్తుంటారు.

ఒడిశా నుంచి ఆంధ్రకు..


బోల్‌భం దీక్షలు ఒడిశా ప్రాంతంలో ఎక్కువగా ఆచరిస్తుంటారు. గత ఐదారు సంవత్సరాలుగా ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఎక్కువ మంది భక్తులు ఈ దీక్షలు ఆచరిస్తున్నారు.

నియమాలతో..

బోల్‌భం దీక్షలు చేపట్టే శివభక్తుల వేషధారణ, దుస్తులతో పాటు వారి ఆహార నియమాలు అన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. పూర్తిగా కాషాయ వస్త్రాలు ధరించి, ముఖానికి, చేతులకు, కాళ్లకు విభూతి పూసుకుంటారు. మెడలో రుద్రాక్ష మాలలు ధరించి... చేతిలో త్రిశూలం పట్టుకుంటారు. నదీజలాలను తీసుకుని ఎంత దూరమైనా కాలినడకలోనే శివనామస్మరణ చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. పూర్తిగా సాత్విక ఆహారమే తీసుకుంటారు. ఆహారంలో ఉల్లి, వెల్లుల్లిని పూర్తిగా త్యజిస్తారు.

నదీస్నానం ప్రత్యేకం

బోల్‌భం దీక్షలను ఉత్తరాది రాష్ట్రాలతో పాటు, ఉత్కళాంధ్రలో భక్తులు ఎక్కువగా స్వీకరిస్తుంటారు. కొంతమంది భక్తులు శివమాలలు ధరించి ఒకచోట పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో సోమవారంతో పాటు అమావాస్య, పౌర్ణమి, సంక్రమణం తదితర ప్రత్యేక రోజుల్లో శివమాలలు ధరించిన స్వాములంతా తమ సమీపంలోని పవిత్ర నదులలో స్నానాలాచరించి, నదీ జలాలను కావిళ్లతో కాలి నడకన సమీపంలోని శివాలయాలకు తీసుకెళతారు. ఆ నీటితో శివునికి అభిషేకం చేస్తారు. మిగిలిన రోజుల్లో సన్నిధానంలో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారు. శ్రావణ మాసం పూర్తయిన తరువాత స్వాములు శైవక్షేత్రాలకు వెళ్లి మాలలను విసర్జిస్తారు. ఇలా ఈ దీక్షలు పూర్తవుతాయి. ఇలా శ్రావణ మాసం మొత్తం భక్తిశ్రద్ధలతో పాటిస్తే కోరికలు నెరవేరడమే కాకుండా లోక కల్యాణం జరుగుతుందని భక్తుల విశ్వాసం.



కోర్కెలు తీరుతాయని విశ్వాసం

బోల్‌భం మాలలు వేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం. మేము భావించినట్టే మా కోర్కెలు తీరుతున్నాయి. అందువల్ల ఐదు సంవత్సరాలుగా ఈ దీక్షలు ఆచరిస్తున్నాను.

- సంతోష్ సాహు, భక్తుడు,

ఏటా ఆచరిస్తున్నా

ఏటా బోల్‌భం దీక్షలు ఆచరిస్తున్నా. శివునికి ప్రీతిపాత్రమైన శ్రావణ మాసంలో దీక్షలు చేస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. ఆహార నియమాల వల్ల ఆరోగ్యం కూడా బాగుంటోంది.

- కాశీ బెహరా, కంచిలి



కవిటి: బెజ్జిపుట్టుగలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



నరసన్నపేట: సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా శ్రావణ పూజలు

శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. లక్ష్మి, పార్వతీదేవిల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలకు కొత్త కళ వచ్చింది. మహిళలు సకల సౌభాగ్యాలతో పాటు శ్రీమహాలక్ష్మి కటాక్షం పొందేందుకు వ్రతాలు, కుంకుమ పూజలు చేశారు. వేకువజాము నుంచే ఆలయాల్లో బారులు తీరారు. ఉపవాసాలు చేసి వాయనాలు ఇచ్చారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి



నందిగాం: నీలమణిదుర్గమ్మకు గాజులతో అలంకరణ



జలుమూరు: శ్రీముఖలింగంలో సామూహిక కుంకుమ పూజలు

సురేఖకు చరిత్రలో ప్రత్యేక స్థానం

- పాణిగ్రాహి సతీమణికి వామపక్ష నేతల ఘన నివాళి

పలాస రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటాల్లో విప్లవకవి సుబ్బారావు పాణిగ్రాహికి చేదోడుగా నిలిచి... బొడ్డపాడు విప్లవ చరిత్రలో భాగస్వామురాలిగా ఉన్న సురేఖ పాణిగ్రాహి చరిత్రలో నిలిచిపోతారని వక్తలు కీర్తించారు. బొడ్డపాడు గ్రామంలో మృతి చెందిన విప్లవకవి సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి మృతదేహానికి వివిధ విప్లవ, వామపక్ష, ప్రజా సంఘాలు, గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె స్వగృహం నుంచి మృతదేహాన్ని స్థానిక అమరవీరుల స్మారక మందిరం వద్దకు తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. వివిధ వామ పక్ష, ప్రజా సంఘాల ఆ ధ్వర్యంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అరుణోదయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజ శేఖర్, ఉద్దానం రచయి తల సంఘ సభ్యులు కుత్తుమ వినోద్, కుమార్ నాయక్, వివిధ వామపక్ష, ప్రజా సంఘాల సభ్యులు విప్లవ గీతాలను ఆలపిం చారు. వివిధ ప్రాంతాల కళాకారులు, అభిమానులు, బొడ్డపాడుతో పాటు చుట్టుపక్కల ఉద్దానం ప్రాంత ప్రజలు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని ఊరేగింపుగా శశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనరావు, వామపక్ష నాయ కులు మద్దిల రామారావు, మద్దిల మల్లేశ్వ రరావు, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, పోతనపల్లి అరుణ, నిరంజన్ పాణిగ్రాహి, బొడ్డు వాసుదేవ్, ఎం.ధర్మారావు, కోదండరావు, సాలిన వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



సురేఖ పాణిగ్రాహి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

పోస్టల్‌లో ఇంటి దొంగలు

(ఐదో పేజీ తరువాయి)

బాలరాజు రూ.15లక్షలు, దుర్గాశి గంగమ్మ రూ.5లక్షలు, ధర్మపురానికి చెందిన పైల దేవమ్మ రూ.6లక్షలు, దుర్గాశి నాగమ్మ రూ.8లక్షలు, బీఎం శరణ్య మాధురి రూ.5లక్షలు ఇలా పలువురు కిసాన్ వికాస్ పత్రం ద్వారా నగదు డిపాజిట్లు చేశామని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

అనంతరం విలేకరుల సమావేశంలో సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో స్కాం జరుగుతోందని ఈ నెల 7న పబ్లిక్ గ్రీవెన్స్ పోర్టల్ ('మీ-కోసం') కార్యక్రమం ద్వారా ఓ బాధితుడు అనే పేరు మీద ఒక ఫిర్యాదు అందింది. ఇచ్ఛాపురంలో కేవీపీ (కిసాన్ వికాస్ పత్రం), టర్మ్ డిపాజిట్ ఖాతాలపైన అధిక మొత్తంలో లావాదేవీలు జరిగాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ రెండు రోజుల తర్వాత అదే బాధితుడు ఏరోజు ఎంత లావాదేవీలు జరిగాయో.. వాటితోపాటు కొంతమంది పేర్లు కూడా ప్రస్తావించి మరోసారి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేయగా ఆన్‌లైన్ ద్వారా అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. మా వార్షిక తనిఖీల్లో కూడా బయటపడకుండా టెక్నాలజీతో ఈ స్కాం జరిగినట్టు గుర్తించాం. దీనికి బాధ్యులుగా ఇచ్ఛాపురం పోస్టాఫీసులో ముగ్గురిని, నౌపడ, మాణిక్యం పురంలో ఒకొక్కరిని మొత్తం మొత్తం ఐదుగురి సిబ్బందిని సస్పెండ్ చేశారు. మరో 9మంది అనుమానితులను గుర్తించి దర్యాప్తు చేస్తున్నాం. కార్యాలయం పాస్‌వర్డ్, యూజర్ నెంబరు, తెలిసినవారు బయట వ్యక్తులతో కుమ్మక్కై డబ్బులు తీస్తున్నట్లు మెసేజ్‌లు రాకుండా జాగ్రత్త పడ్డారు. పోస్టల్‌లో డిపాజిట్ చేసినట్లు ఆధారాలు ఉన్న లబ్ధిదారులందరికీ ప్రతీ రూపాయి అందుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ ద్వారా పోయిన సొమ్ము రికవరీ అయినా అవ్వకపోయినా వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఈ కేసును సీబీఐకి అప్పగించాం. సీబీఐ ద్వారా ఈడీకి కూడా వెళ్తుంది' అని తెలిపారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు

సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి..

ఇచ్ఛాపురం హెడ్ పోస్టాఫీసులో రూ.కోట్లలో నగదు మాయం వెనుక ఇంటి దొంగల పాత్ర ఉన్నట్టు స్పష్టమవుతోంది. సాధారణంగా పోస్టాఫీసు, ఖాతాదారు యూజర్ ఐడీ సంబంధిత ఉద్యోగుల వద్దే ఉంటుంది. ఆ యూజర్ ఐడీ హ్యాక్ చేయడమంటే చిన్న విషయం కాదు. పోస్టల్ సిబ్బందిలో ఎవరో ఒకరు సైబర్ నేరస్థులతో చేతులు కలపడం ద్వారానే ఇంతటి భారీ స్కాం జరిగే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల డిజిటల్ లావాదేవీలు పెరిగిన దృష్ట్యా బ్యాంకింగ్ రంగంతోపాటు ఆర్థికపరమైన ప్రతి అంశానికి సైబర్ నేరాలు వెంటాడుతున్నాయి. పోస్టల్ శాఖలోనూ ఇటువంటి ఆర్థిక మోసాలు చోటుచేసుకోవడంపై ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

రెండు చెరువులు.. 11 ఎకరాలు

(ఐదో పేజీ తరువాయి)

తమకు ఎంత భూమి ఉందో చూపించాలని అధికారులను కోరారు. దీంతో ఆక్రమణలు తొలగింపు సులభమైంది.

- పలాసలోని పురుషోత్తపురం సర్వేనెంబరు 29లో ఉన్న ఎర్రచెరువు కూడా ఆక్రమణకు గురైంది. స్థానికులు కొంతమంది నివాసాలు ఏర్పాటు చేసుకోగా, మరికొంతమంది రియల్‌ఎస్టేట్‌గా మార్చుకున్నారు. దీనిపై మునిసిపల్ సర్వేయర్ చలపతిరావుతోపాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మొత్తం మూడు రోజులపాటు సర్వే నిర్వహించి ఆక్రమణలు గుర్తించారు. 1.01 ఎకరాల్లో మొత్తం 60 నివాసాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇంకా 2.38 ఎకరాలు ఆక్రమించి కంచెను వేసినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. 1.58 ఎకరాల స్థలం రహదారిలో ఉన్నట్లు అధికారులు రూట్‌మ్యాప్ చూపించారు. నివాసాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోయినా మిగిలిన ఆక్రమణలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడానికి జిల్లా అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. దీంతోపాటుగా ఎర్రచెరువుకు వచ్చే వరదనీటి కాలువ 6 ఎకరాలు కూడా ఆక్రమణలకు గురైంది. పూర్తిగా కాలువ కావడంతో వరదలు వస్తే మాత్రం ఆ ప్రాంతంలో ఉన్న నివాసాలు ముంపునకు గురికావడం ఖాయం.
- ఈ వ్యవహారంపై తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిని వివరణ కోరగా 'కుంకుమసాగరం, ఎర్రచెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సమగ్ర సర్వే చేసి ఆక్రమణలు గుర్తించాం. కుంకుమసాగరంలో ఆక్రమణలు తొలగించాం. ఎర్రచెరువు పరిధిలో ఆక్రమణలు తొలగిస్తాం. మునిసిపాలిటీలో చెరువులన్నీ సర్వేచేసి ఆక్రమణలు గుర్తించి నోటీసులు అందజేస్తామ'ని తెలిపారు.

అత్యవసరమైతే.. నడకే మార్గం

- దారుణంగా కొతారింగి తాళభద్ర రహదారి
- వర్షం పడితే అంతే సంగతులు
- అంబులెన్స్ రావడమూ కష్టమే

పలాస రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పలాస మండలం తర్లాకోట పంచాయతీకి చెందిన చిట్ట చివరి గిరిజన గ్రామమైన కొతారింగి తాళభద్ర గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడమంటే నరకాన్ని దాటినట్లేనని చెప్పవచ్చు. రహదారుల రూపంలో అక్కడ నరకం ఎదురవుతుంది. పలాస మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామమే చివరిది. ఆ తరువాత అంతా కొండలే. ఈ గ్రామానికి వెళ్లేందుకు మహాదేవపురం మీదుగా ఒకటి... అల్లుకోల మీదుగా రెండు రహదారులు ఉన్నాయి. మహాదేవపురం వరకూ కంకర రోడ్డు ఉంది. అనంతరం మట్టిరోడ్డు... మధ్యలో కల్వర్టు నిర్మాణానికి గోతులు తీసి ఉన్నారు. దీంతో వర్షం నీటితో రహదారి అత్యంత దారుణంగా తయారైంది. అల్లుకోల నుంచి ఈ గ్రామానికి చేరుకోవాలన్నా... ఆ గ్రామం దాటిన తరువాత రోడ్డు ఛిద్రంగా మారింది. భారీ వర్షాలు పడితే ఆ గ్రామానికి అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం ఉండదు. ప్రసవాలు, ఇతర అత్యవసర సమయాల్లో వాహనాలు సకాలంలో ఊరిలోకి చేరుకోలేకపోతుండడం గ్రామస్థులకు శాపంగా మారింది. ప్రధాన రహదారికి చేరుకోవాలంటే సుమారు 3 కిలోమీటర్ల దూరం నడవాల్సిందేనని గ్రామస్థులు చెబుతున్నారు. మహాదేవపురం నుంచి కొతారింగి తాళభద్ర గ్రామం వరకూ రహదారి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో ఏఐబీ నిధుల నుంచి నిధులు మంజూరు చేసినా అవి పూర్తిస్థాయిలో రాలేదు. దీంతో రహదారి నిర్మాణానికి నోచుకోలేదు.

బురదలో కూరుకుపోవలసిందే..

ప్రస్తుత వర్షాలతో ఈ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు పొలాలను తలపిస్తోంది. ద్విచక్ర వాహనాలపై వెళుతున్నా... అవి బురదలో కూరుకుపోతున్నాయి. భారీ వాహనాలు అటువైపు చూడలేని పరిస్థితి ఉంది. రాత్రిపూట ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి కష్టాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారి సుధాకర్‌ను వివరణ కోరగా పొత్రియ గ్రామం నుంచి కొతారింగి తాళభద్ర వరకూ ఉపాధి హామీ పథకం కింద రూ.కోటి 70లక్షలతో రహదారి నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. దీనిపై ఆదేశాలు రావలసి ఉందని చెప్పారు.



కొతారింగితాళభద్ర గ్రామ రహదారి

ఆస్పత్రికి వెళ్లాలంటే కష్టం



ఈ రహదారి బురదమయం కావడంతో గ్రామంలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తినపుడు అత్యవసరంగా ఆసుపత్రికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అంబులెన్స్ ఈ రహదారిలో ప్రయాణం చేయనందున మూడు కిలోమీటర్లు నడకమార్గమే శరణ్యం. ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మించి... మాకు న్యాయం చేయాలి

- సవర చంటి, కొతారింగి తాళభద్ర

రోడ్డు నిర్మించాలి



ఈ గ్రామానికి చేరుకోవాలంటే రహదారి అసౌకర్యంగా మారింది. ఈ రహదారి వర్షాకాలంలో అస్తవ్యస్తంగా ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణం చేపడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

- మామిడి ప్రసాద్, సమరసత సేవా సంస్థ సభ్యుడు

పక్కా ప్రణాళికతో ఎరువుల పంపిణీ

(ఐదో పేజీ తరువాయి)

చేయాలి. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వివరాలు నమోదు చేయాలి. ఎరువుల డిమాండ్, వరినాట్ల విస్తీర్ణం, తదితర సమాచారం ఆధారంగా ఎరువులు అందజేయాల'ని తెలిపారు. రైతులకు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయంలో కూడా సమస్యలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ సహాయక కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు త్రినాథస్వామి, ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణ, డీసీఎం బిజినెస్ మేనేజర్ ఎం.జగ్గునాయుడు, శాస్త్రవేత్తలు డా.చిట్టిబాబు, డా.పి.ఉదయ్‌బాబు, కోపరేటివ్ సొసైటీ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో మంత్రి ఆనం


మంత్రికి స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం, ప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదిత్యుని దయవల్ల ఏడాది పాలన విజయవంతంగా పూర్తయిందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, ప్రజల మన్ననలను పొందగలిగామని చెప్పారు. స్వామివారి కృపతో మరింత మెరుగైన పాలన అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేసీ త్రినాథరావు, డీసీలు శోభారాణి, సుజాత, జిల్లా దేవదాయశాఖ అధికారులు, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆమదాలవలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎంచంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు ఆధ్వర్యంలో స్పందన నిర్వహించి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే కూన రవికుమార్ సకాలంలో పరిష్కరించడం ద్వారా దీనిపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. కార్యక్రమంలో నేతలు బీవీ రమణమూర్తి, మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): జాలారి కొయ్యాంలో పేదల సాగులో ఉన్న 40 ఎకరాలకు పట్టాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ భూమిలో నీలగిరి మొక్కలను శుక్రవారం నాటారు. కార్యక్రమంలో తాతారావు, మారుపల్లి రాజు, అప్పలరాజు, రామారావు, వీర్రాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామంలో సముద్రపు నాచుపై సంత బొమ్మాళి, బారువ, బుడగట్లపాలెం మత్స్యకారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.సత్యనారాయణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, ఎఫ్‌డీవో కె.రవికుమార్, ధర్మరాజు పాత్రో, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు, పలువురు స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో సీజనల్ జ్వరాలు విజృంభి స్తున్నాయని, ఈ నేపథ్యంలో గురుకులాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు శుక్ర వారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్క ర్‌ను కలిసి వినతిపత్రం అందిం చారు. గతం లో గురుకులాల్లో ఫిర్యాదుల బాక్సులు తెరిచే వారని, ఇప్పుడు వాటిని కనీసం పట్టించు కోవడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, లోపింటి తేజేశ్వరరావు, కానుకుర్తి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సాధికారతే పీ-4 లక్ష్యం

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబునాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీ-4 కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా తీర్చిదిద్దుతున్నామని, పేదల సాధికారతే పీ-4 లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలు మార్గదర్శుల మద్దతుతో ఎదిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు బంగారు కుటుం బాలను దత్తత తీసుకోవాలన్నారు. ఆగస్టు 10వ తేదీ లోగా సర్వే పూర్తి చేయాలని, 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేను స్వయంగా 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నానని, నా నుంచే ఇది ప్రారంభమవుతుంది. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, నడుకుదిటి ఈశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, సీపీవో ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

పశువులు పట్టివేత

శ్రీకాకుళం రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులను పెద్దపాడు ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. నారాయణవలస సంత నుంచి 7 ఆవులను, ఒక దూడను వైజాగ్ తరలిస్తుండగా పట్టుబడ్డాయన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'అమ్మకు వందనం' పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్ జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శుక్ర వారం పలువురు రాసిన కవితలతో కూడిన 'అమ్మకు వందనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో తెలుగు రచయితల వేదిక కవులు సోడవరం ఈశ్వరరావు, పెంకి నాగేశ్వరరావు, సత్యానందం ఐఎన్‌డీ ప్రసాద్, కొప్పల సూర్యనారాయణ, కె.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

800 ఎకరాల్లో వరి పంట ముంపు


ముంపునకు గురైన పొలాలు

సరుబుజ్జిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభా వంతో కురు స్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుం చి భారీగా వరద నీరు వచ్చి శుక్ర వారం మం డలంలో సుమారు 800 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. బుడ్డివలస, తెలిపిపెంట, పాత పాడు అగ్ర హారం, శాస్త్రులపేట, వీరమ ల్లిపేట, తురకపేట, వీర భద్రాపురం తదితన గ్రామాల్లో లోతట్టు ప్రాంతా ల పొలాల్లోకి నీరు చేరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అభివృద్ధిలో ఎచ్చెర్లను నెంబర్-1 చేస్తా

● ఎమ్మెల్యే ఎన్ఈఆర్


నారాయణపురం కుడి కాలువకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని నెంబర్-1గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. నవభారత్ జంక్షన్ వద్ద నారాయణపురం కుడి కాలువకు శుక్రవారం జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో నారాయణపురం కాలువ పూర్తిగా నిర్ల క్ష్యానికి గురైందన్నారు. ఇటీవల బుడగట్లపాలేనికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి కాలువ దుస్థితిని వివరించా మని, దీంతో ఆయన స్పందించి రూ.3 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో కాలు వ పొడవునా పూడికలు తొలగించి అభివృద్ధి చేశామన్నారు. ఈ కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలో సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు విష్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, పైడి అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివి: శంకర్


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే గొండు.శంకర్ పేర్కొన్నారు. నగరంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వ ర్యంలో కార్గిల్ విజయ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు నిత్య స్మరణీయమన్నారు. త్వరలో సంక్షేమ భవనం నిర్మాణం పూర్తి కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.శైలజ, సంఘం చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, సంఘ ప్రతినిధులు బి.సూర్యనారాయణ, పి.మురళీధరరావు, సీహెచ్ రామారావు, విశ్రాంత కల్నల్ మెండ రాయణరావు, పి.చంద్రశేఖర్, జెజె.రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

4 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, జూలై25(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఆగస్టు 4వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ శుక్రవారం తెలిపారు. ఇతర వివరాలకు 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

50 రోజులుగా అన్నదానం

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గడచిన 50 రోజులుగా అన్నదానం చేస్తూ ఓ క్రీడాకారుడు తన ఔదార్యాన్ని చాటుకుంటున్నాడు. స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, క్రీడా పోషకుడు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. తనశక్తి కొలది అన్నప్రసాద వితరణ చేపడుతున్నానన్నారు. శుక్రవారానికి 50 రోజులు పూర్తవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు నైట్ షెల్టర్‌లో పేదలు, బిక్షాటన చేసిన వారికి ఆకలి తీర్చడం మహాభాగ్యంగా భావిస్తున్నానన్నారు.


CHANGE OF NAME

I BOTCHA KRISHNA RAO (New Name) Father of Botcha Sriharsha previously called as Botsa Krishna rao (Old Name) residing at plot no. 37, KOBBARI CHETLA STREET. ARASAVALLI RURAL, Arasavilli (Rural), Srikakulam, Andhra Pradesh, 532401. Now changed my name from BOTSA KRISHNA RAO (old name) to BOTCHA KRISHNA RAO (New Name). Henceforth I will be called as Botcha Krishna rao (New Name) for all purposes.











విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి


గోవిందరావు (ఫైల్)

రణస్థలం, జూలై 25(ఆంధ్రజ్యోతి):రణస్థలంలోని ఓ భవన నిర్మాణంలో రాడ్‌బెండింగ్ పనులుచేస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి నెల్లిమర్లమండలం జగరాజుపేటకి చెందిన కె.గోవిందరావు (48)శుక్రవారం మృతిచెందాడు.పోలీసుల కథనం మేరకు.. రణస్థలానికి చెందిన అదపాక పైడిరాజు ఇంటి నిర్మాణం చేపడుతున్నారు.రాడ్‌బెండింగ్ పనులు చేపడుతున్న సమయంలో భవనంపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో గోవిందరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్సనిమిత్తం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

కవిటి, జూలై 25(ఆంధ్రజ్యోతి): బొరివంక వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. సీహెచ్ కపాసుకుద్దికి చెందిన వి.రాజు, కె.జోగారావు, కె.మేఘనాథం కలిసి బైక్‌పై గురువారం రాత్రి సోంపేటలో సినిమా చూసేందుకు వెళ్లారు. తిరిగి అతివేగంతో వస్తూ బొరివంక సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులనుసోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం అక్కడి ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పూండి రహదారిపై ఇద్దరికి ..

వజ్రపుకొత్తూరు,జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూండి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం పలాస నుంచి పూండి వైపు ద్విచక్రవాహనంపై మహిళతోపాటు కలిసివస్తున్న దున్న హేమారావుకు పూండి వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో హేమారావుతోపాటు మహిళకు గాయాలుకావడంతో 108లో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం తరలించారు. కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ నిహార్ చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రణస్థలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి గ్రామానికి సమీపంలోని ఒకతోటలో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై జేఆర్‌పురం పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముందుస్తు సమాచారం మేరకు దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.12,420 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

20 రోజుల వ్యవధిలో దంపతుల మృతి

● ఒంకులూరు గ్రామంలో అనాథగా మారిన కుమార్తె


తలకొరివి పెడుతున్న కుమార్తె హిందు

వజ్రపుకొత్తూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒంకులూరు గ్రామానికి చెందిన దుమ్ము రాజు (45) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందడంతో కుమార్తె హిందు తలకొరివి పెట్టింది. గ్రామస్థుల కథనం మేరకు.. హిందు తల్లి దుమ్ము లక్ష్మీదేవి కూడా కిడ్నీవ్యాధితో ఈనెల ఆరో తేదీన మృతిచెందింది. భార్య మృతిచెందిందని బెంగతో తండ్రి రాజు కూడా 20 రోజుల్లో మృతి చెందడంతో హిందు ఒంటరిగా మిగిలింది.17 ఏళ్ల హిందు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం చిన్నాన్న దుమ్ము రమేష్ సంరక్షణలో ఉంటోంది. దంపతులు 20 రోజుల వ్యవధిలోనే మృతిచెందడంపై హిందు అనాథగా మారింది. గ్రామంలో విషాదం నెలకొంది.

బాతుపురంలో చిన్నపిల్లమ్మ అంత్యక్రియలు

వజ్రపుకొత్తూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాతుపురంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మోటూరు జోగారావు తల్లి చిన్నపిల్లమ్మ అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి.చిన్నపిల్లమ్మ గురువారం మృతిచెందారు.ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, జననాట్యమండలి సభ్యులు జోహార్లు అర్పించారు, చిన్నపిల్లమ్మ మూడో కుమారుడు శ్యామసుందరరావు తల్లికి తలకొరివి పెట్టారు. తొలుత చిన్నపిల్లమ్మ మృతదేహాన్ని గ్రామంలో ఊరేగించారు.


కర్లెమ్మఆర్ఆర్ కాలనీలో కార్డెన్‌సెర్చ్

కొత్తూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లెమ్మ ఆర్ఆర్‌కాలనీలో శుక్రవారం సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్‌ఐ అమీర్‌ఆలీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఐదువాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలియజేయాలని కోరారు.

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, జూలై 25(ఆంధ్రజ్యోతి):మెళియాపుట్టిలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని టీడీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బసవ పరమేష్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనులపై వస్తున్నారని, వారికి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి: బగ్గు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం నరసన్నపేటలో జలుమూరు మండల టీడీపీ అనుబంధ కమిటీలను నియమించారు. పార్టీ మండలాధ్యక్షుడిగా వెలమల రాజేంద్రనాయుడు, ఉపాధ్యక్షులుగా తమ్మన్నగారి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బగ్గు గోవిందరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అక్కాజోస్యులు ఉమా దత్తుబాబు, పంచిరెడ్డి సింహాచలం, కొబగాపు ఉత్తరకుమార్, కార్యదర్శిలుగా యజ్జల దాలయ్య, కళ్యాణం కోటేశ్వరరావు, పిరియా వెంకట్రావు, కోశాధికారిగా రేగాన సత్యనారాయణలను నియమించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.వెంకటేష్, పార్టీ జిల్లా నాయకులు పీఎంజేబాబు, నియోజవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

జలుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జలుమూరులో కొమనాపల్లికి చెందిన కెల్ల రోహిత్‌కుమార్‌కు రు.70,000లు, పర్లాం మాకివలసకు చెందిన శిమ్మ సూర్యానారాయణకు రూ.48,184లు, కూర్మనాథపురానికి చెందిన మొయ్యి గోవిందరావుకు రూ.57,348 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం అందజేశారు.

పాలకుల మౌనం.. ప్రజలకు శాపం


టెక్కలి నియోజకవర్గం మ్యాప్

● నందిగాం మండల ప్రజలకు అగచాట్లు ● పాత డివిజన్‌లోకి చేర్చాలని డిమాండ్ ● తాజాగా ఏర్పాటుచేసిన మంత్రి వర్గ ఉపసంఘంపైనే ఆశలు

టెక్కలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్విభజన సమయంలో డివిజన్లు, జిల్లాల ఏర్పాట్లు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఇందులో భాగంగా గతంలో టెక్కలి డివిజన్, టెక్కలి నియోజకవర్గంలోఉన్న నందిగాం మండలాన్ని 2020 తర్వాత పలాస డివిజన్‌లోకి చేర్చిన విషయం విదితమే. దీంతో నందిగాం మండల ప్రజలు తీవ్రంగా ఈ నిర్ణయాన్ని అప్పట్లో వ్యతిరేకించారు. అయినా అప్పటి వైసీపీ పాలకుల మౌనం ప్రజలకు శాపంగా మారింది. ఏఒక్క వైసీపీ నాయకుడు గొంతు విప్పకపోవడంతో ప్రభుత్వం ఆ నిర్ణయం వెనక్కు తీసుకోలేదు. వైసీపీ నాయకులు నందిగాం మండలాన్ని పలాస డివిజన్‌లో కాకుండా టెక్కలి డివిజన్‌లో ఉంచడంలో తమవాదనను అప్పట్లో అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లలేదన్న విమర్శలున్న విషయం విదితమే. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలతో ఉన్న టెక్కలి నియోజకవర్గంలో ఒక్క నందిగాం మండలాన్నే పలాస డివిజన్‌లో 2020లో చేర్చారు. రాష్ట్రంలో విస్తీర్ణంలో పెద్ద మండలమైన నందిగాంలో 37 పంచాయతీలు, సుమారు 56వేల జనాభా, 50,129 మంది ఓటర్లుఉన్నారు. భౌగోళికంగా టెక్కలికి దగ్గరగా ఉండడంతోపాటు సత్సంబంధాలు ఎక్కువగా ఉండడంతో పలాస డివిజన్‌లో చేర్చడంతో నందిగాంలో గల రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అప్పట్లో అధికార పార్టీ నాయకులు వైసీపీ అధిష్టానం ముందు తమ వాదనను గట్టిగా వినిపించలేకపోవడంతో టెక్కలి డివిజన్‌లోఉన్న నందిగాం పలాస డివిజన్‌లో చేరిపోయింది. ఈనేపథ్యంలో ఇటీవల జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు మార్పులు, చేర్పులకోసం అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. ఏడుగురు మంత్రులు, రెవెన్యూ శాఖ ప్రత్యేకప్రధానకార్యదర్శి పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో నందిగాం మండలం తిరిగి టెక్కలి డివిజన్‌లోకి తీసుకువచ్చేందుకు ఇక్కడి ప్రజలు మంత్రి వర్గ ఉపసంఘంపైనే ఆశలు పెట్టుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు చొరవచూపి నందిగాం మండలాన్ని టెక్కలి సబ్‌కలెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని పలు సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

అధునాతన విధానాలను అవలంభించాలి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంజీఆర్

పాతపట్నం, జూలై25(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు అధునాతన అవలంబించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు.శుక్రవారం మండలంలోని సీదిలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా సంకరజాతి ఆవుదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించాయి. ఈసందర్భంగా ఆయన కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన పాడిరైతుల్లో ఆధునిక విధానాలపైఉన్న సందేహాల నివృత్తిచేసిందన్నారు.కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఈవో సీహెచ్ సత్యప్రకాశ్, డీడీ నరసింహులు, ఎంపీడీవో చంద్రకుమారి, ఏడీ కరుణాకరరావు పాల్గొన్నారు.అలాగే సమస్యలను పరిష్కరించడమే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మండలంలోని పాశిగంగు పేటలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

దంతలో ఉపాధ్యాయుల బదిలీ

● కన్నీరు పెట్టుకున్న ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థులు


ఉపాధ్యాయుల వద్ద కన్నీరు పెడుతున్న విద్యార్థులు

కోటబొమ్మాళి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంత ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు గొండు నారాయణరావు, జ్యోతి, గణేష్, వేణుగోపాలరావు సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు పాఠశాలలకు బదిలీఅయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామస్థులు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఐదేళ్లు తమకు ఆటపాటలతో విద్య నేర్పించిన ఉపాధ్యాయులు ఇక తమ పాఠశాలకు రారని తెలియడంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులు కన్నీరుపెట్టారు. విద్యార్థులను ఓదార్చడం ఉపాధ్యాయులు తరం కాలేదు. తమ పిల్లలు పాఠశాలలో చేరినప్పటి నుంచి ఈ ఉపాధ్యాయులే ఉండడం, తమ కంటే మాస్టర్లు దగ్గరే ఎక్కువ సమయం గడపడం,సొంత పిల్లలా వారు చూసుకోవడం వల్లే విద్యార్థులంతా ఇంతగా బాధ పడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు.

నర్సిపురంలో ఎరువుల పంపిణీ

నందిగాం, జూలై 25(ఆంధ్రజ్యోతి):నర్సిపురంలోని దిమిలాడ పీఏసీఎస్‌లో ఎరువులు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, వంశధార డీసీ చైర్మన్ బాలకృష్ణ, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

టెక్కలి డీఎస్పీగా లక్ష్మణరావు

టెక్కలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): టెక్కలి డీఎస్పీగా డి.లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.విశాఖక్రైమ్ విభాగం డీఎస్పీగాఉన్న ఆయన బదిలీపై టెక్కలి వచ్చారు. కాగా కొద్దినెలలుగా టెక్కలి డీఎస్పీగా ఇన్‌చార్జి అధికారి వ్యవహరించారు. ఈనేపథ్యంలో టెక్కలిలో పూర్తి స్థాయి డీఎస్పీగా లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరించారు.

ఏఈగా సూర్యారావు

జలుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జలుమూరు మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎం.సూర్యారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడు ఏఈగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు శ్రీకాకుళం స్టోర్సుకు బదిలీపై వెళ్లారు. అక్కడ ఏఈగా పనిచేసిన సూర్యారావు జలుమూరు ఏఈగా నియమితులయ్యారు.

న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి



శ్రీకాకుళం లీగల్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తక్షణమే రక్షణ చట్టాన్ని చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, ఐలూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కూన అన్నంనాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, గేదెల ఇందిరా ప్రసాద్, ఇప్పిలి సీతరాజు, సూర వేణుగోపాల్, అన్నెపు సత్యనారాయణ పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం,జూలై 25(ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు డిమాండ్‌చేశారు ఈ మేరకు శుక్రవారం కోర్టు ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ పిలుపు మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు పాత్రో ఆధ్వర్యంలో బార్‌అసోసియేషన్ సహకారంతో నిరసన చేపట్టారు కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శి జి.కామేష్, ఎం.రాంబాబు, బైరాగిరెడ్డి, సీతయ్య, వేణు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు: ఎస్పీ


అర్జీదారులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

పలాస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల నివేదికను జిల్లా కార్యాలయానికి అందించాలని ఆయన కోరారు.

నేడు అధికారులతో సమీక్ష

నరసన్నపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షించనున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. కార్యక్రమంలోకలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బహుమతుల ప్రదానం

కోటబొమ్మాళి, జూలై 25 (ఆంధ్రజ్యోతి):పొగాకు నిర్మూలనపై ఈనెల ఒకటి నుంచి 21వతేదీ వరకు మండల స్థాయిలో విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించి సంతకం సేకరణ కార్యక్రమంపై నిర్వహించిన పోటీలో విజేతలకు ఎంఈవోలు గోవిందరావు, ఎల్వీ ప్రతాప్ శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో కొత్తపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు టి.ఉదయ్, అంధవరపు సుగుణశ్రీలు ఒక్కొక్కరూ 100మందికిపైగా పొగాకు వినియోగిస్తున్న వారి వద్దకు వెళ్లి నిర్మూలనపై అవగాహన కల్పించి వారి వద్దనుంచి సంతకం సేకరించి ప్రథమస్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శాంతికుమారి, ఉపాధ్యాయులు షణ్ముఖరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

జలుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదివిన ఇద్దరు పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు హెచ్ఎం నిర్మలాదేవికి శుక్రవారం అందజేశారు. గత ఏడాది పదో తరగతిలో 584 మార్కులు సాధించిన ఎం.లిఖిత, 564 మార్కులు సాధించిన జె.సాయి తనూజ ఐదు వేలు చొప్పున ఇచ్చారు.

వసతిగృహం పరిశీలన

నందిగాం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నందిగాం బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల గదులు,వంటశాల, మరుగుదొడ్లు డిప్యూటీ ఎంపీడీవో టి.రాజారావు శుక్రవారం పరిశీలించారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వర్షం నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికిసూచించారు.ఆయన వెంట వసతిగృహ అధికారి టి.శ్రావణి ఉన్నారు.

ఉదయం కసరత్తు.. మధ్యాహ్నం తర్ఫీదు

● జిల్లాలో పలు చోట్ల ఆర్మీ ర్యాలీకి సిద్ధమవుతున్న విద్యార్థులు

నరసన్నపేట, జూలై25(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని యువకులు తర్వలో జరిగే ఆర్మీ ర్యాలీకి సన్నద్ధమవుతున్నారు. ఉదయం శారీరక దారుఢ్యం కోసం కసరత్తు చేస్తున్నారు. మధ్యాహ్నం పరీక్షకోసం తర్ఫీదు పొందుతున్నారు. ఎలాగైనా సైన్యంలో చేరి దేశానికి సేవచేయాలని భావించి యువకులు శ్రమిస్తున్నారు. ఆగస్టులో ఆర్మీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో దేశరక్షణలో సైనికులుగా చేరేందుకు ఎంపికలు నిర్వహించనున్నారు. దీంతో దేశసేవ చేయడంతోపాటు ఉపాధిలభించడంతో కుటుంబానికి చేదోడుగా ఉండొచ్చని భావించి యువత ఆర్మీలో చేరడానికి ముందుకొస్తున్నారు. నరసన్నపేట, తదితర ప్రాంతాల్లో యువకులు శారీరక దారుఢ్య పరీక్షలతోపాటు రాతపూర్వక పరీక్షల్లో తర్ఫీదు పొందుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని సుమారు 500పైగా యువకులు నరసన్నపేటలో వివిధ కోచింగ్ సెంటర్లల్లో శిక్షణపొందుతున్నారు.


నరసన్నపేటలో వ్యాయామం చేస్తున్న యువకులు

పీఎండీఎస్ పద్ధతిలో అధిక దిగుబడి

పాతపట్నం,జూలై 25(ఆంధ్రజ్యోతి): పీఎండీఎస్ పద్ధతిని పాటించి విత్తనాలువేస్తే అధికదిగుబడి పొందవచ్చని బ్రెడ్స్‌కోఆర్డినేటర్ లవకిశోర్ తెలిపారు.బడ్డుమర్రిలో రైతులు బోను యర్రయ్య, బోను నాగరాజు సాగుకుముందుకు రాగా వారితో ప్రయోగాత్మకంగా పీఎండీఎస్ విధానంలో విత్తనాలు వేసే ప్రక్రియ నిర్వహించారు.

ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు,జూలై 25(ఆంధ్రజ్యోతి):వసప కేజీబీవీఎస్‌వో పల్లా రాధికపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినులపై బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న ఎస్‌వోపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని, అక్రమాలకు పాల్పడడంలేదని ఎస్‌వో రాధిక తెలిపారు.

ఆదిత్యుని సేవలో మంత్రి ఆనం


మంత్రికి స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం, ప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదిత్యుని దయవల్ల ఏడాది పాలన విజయవంతంగా పూర్తయిందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, ప్రజల మన్ననలను పొందగలిగామని చెప్పారు. స్వామివారి కృపతో మరింత మెరుగైన పాలన అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేసీ త్రినాథరావు, డీసీలు శోభారాణి, సుజాత, జిల్లా దేవదాయశాఖ అధికారులు, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆమదాలవలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎంచంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు ఆధ్వర్యంలో స్పందన నిర్వహించి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే కూన రవికుమార్ సకాలంలో పరిష్కరించడం ద్వారా దీనిపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. కార్యక్రమంలో నేతలు బీవీ రమణమూర్తి, మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): జాలారి కొయ్యాంలో పేదల సాగులో ఉన్న 40 ఎకరా లకు పట్టాలు మంజూరుచేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ భూమిలో నీలగిరి మొక్కలను శుక్రవారం నాటారు. సముద్ర తీరంలోని ప్రభుత్వ భూములు మత్స్యకారులకే చెందాలన్నారు. కార్యక్రమంలో తాతారావు, మారుపల్లి రాజు, అప్పలరాజు, రామారావు, వీర్రాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామంలో సముద్రపు నాచుపై సంత బొమ్మాళి, బారువ, బుడగట్లపాలెం మత్స్యకారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ.. సముద్రపు నాచువల్ల కలిగే ఉపయోగాలు, వాణిజ్య పరంగా వాటి విలువను వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ, ఎఫ్‌డీవో కె.రవి కుమార్, ధర్మరాజు పాత్రో, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

800 ఎకరాల్లో వరి పంట ముంపు



సరుబుజ్జిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి శుక్ర వారం మండలంలో సుమారు 800 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. బుడ్డివలస, తెలిపిపెంట, పాతపాడు అగ్ర హారం, శాస్త్రులపేట, వీరమల్లిపేట, తురకపేట, వీర భద్రాపురం తదితన గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల పొలాల్లోకి నీరు చేరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

గురుకులాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నా యని, ఈ నేపథ్యంలో గురుకులాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో గురుకులాల్లో ఫిర్యాదుల బాక్సులు తెరిచేవారని, ఇప్పుడు వాటిని కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, లోపింటి తేజేశ్వరరావు, కానుకుర్తి గోవింద్, దీర్ఘాశి హరీష్ కుమార్ పాల్గొన్నారు.

నదీతీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వంశధార నదీతీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రామారావు కోరారు. శుక్రవారం కొమనాపల్లి వద్ద వంశధారనది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వంశధారనదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశముందని చెప్పారు.నదీతీరంలోని కొమనాపల్లి, నగిరికటకం, అచ్యుతాపురం, సురవరం, తిమడాం, మాకివలస, పర్లాం, అందవరం తదితర గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలకు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో శివస్వాముల పూజలు


శ్రీముఖలింగేశ్వరాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పూరీకి చెందిన శివస్వాములు

జలుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీ జగన్నాథాలయానికి చెందిన శివస్వాములు శివదీక్ష తీసుకొని 45 రోజులు పూజలు చేశారు. అనంతరం కావిడితో శ్రీముఖలింగం చేరుకొని వంశధారనదిలో స్నానాలు ఆచరించారు. నదీ జలాలను కావిడిలో నింపుకొని శ్రీముఖలింగేశ్వరునికి పూజలు చేశారు. అనంతరం మళ్లీ వంశధారనదిలో కావిడిలో నింపుకొని రావివలస కాలినడకన వెళ్లి ఎండల మల్లికార్జున స్వామికి అభిషేకం చేసి శివదీక్షను విరమిస్తున్నట్లు శివస్వాములు తెలిపారు.

అక్కుపల్లి జీడి రైతుకు సన్మానం

పలాస, జూలై 25(ఆంధ్రజ్యోతి):వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లికి చెందిన జీడి రైతు ఎంపల్ల నారాయణను తమిళనాడులోని మహాబలిపురం ఐటీసీ భవనంలో శుక్రవారం జరిగిన ఆలిండియా క్యాజూ కాన్ఫరెన్స్‌లో అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. పలాస జీడికి ఇటీవల జాతీయస్థాయిలో కూడా వన్ డిస్ట్రిక్ట్ -వన్ ప్రొడక్ట్ కార్యక్రమం కింద అవార్డు లభించిన విషయం విదితమే. ఈ మేరకు గుర్తింపు ఇవ్వాలన్న ఉద్దేశంతో జీడి రైతును సత్కరించినట్లు ఆలిండియా క్యాజూ అసోసియేషన్ బోర్డు సభ్యుడు పలాసకు చెందిన మల్లా కాంతారావు తెలిపారు. కార్యక్రమంలో పలాస జీడి వ్యాపారులు కోరాడ సంతోష్‌కు మార్, అందవరపు రతన్‌బాబు, కొంచాడ మన్మథరావు, సందీప్, పెంట రాజు, వెంకటరాజు, కన్నన్, పవన్, సత్యారావు, కృష్ణారావు, రామారావు, ఏపీ క్యాజూ అసోసియేషన్ అధ్యక్షుడు ఫణిరాఘవులు పాల్గొన్నారు.

పేదల సాధికారతే పీ-4 లక్ష్యం

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబునాయుడు


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీ-4 కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా తీర్చిదిద్దుతున్నామని, పేదల సాధికారతే పీ-4 లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలు మార్గదర్శుల మద్దతుతో ఎదిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు బంగారు కుటుం బాలను దత్తత తీసుకోవాలన్నారు. ఆగస్టు 10వ తేదీ లోగా సర్వే పూర్తి చేయాలని, 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేను స్వయంగా 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నానని, నా నుంచే ఇది ప్రారంభమవుతుంది. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, నడుకుదిటి ఈశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, సీపీవో ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువులు పట్టివేత

శ్రీకాకుళం రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులను పెద్దపాడు ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. నారాయణవలస సంత నుంచి 7 ఆవులను, ఒక దూడను వైజాగ్ తరలిస్తుండగా పట్టుబడ్డాయన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ ఏర్పాటు

టెక్కలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా సంస్థ(ఆర్టీసీ)లో జై భీమ్ అసోసి యేషన్‌ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం టెక్కలిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఏఎస్ చలం, ఉపాధ్యక్షుడిగా ఎల్ఎమ్ రావు, జిల్లా కార్యదర్శిగా బి.ధనుంజయరావు, కోశాధికారిగా సీహెచ్‌వీ రమణ, కార్యవర్గ సభ్యులుగా ఎస్ఆర్ రావు, జీఎస్ నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నివగాంలో కేంద్ర బృందం పర్యటన

కొత్తూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నివగాం పంచాయతీలో శుక్రవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కేంద్ర బృందం సభ్యులు సునీల్ బంటా, నాథుసింగ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు, అభివృద్ధి సంక్షేమంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎండీడీవో వి.నీరజ, డిప్యూటీ ఎంపీడీవో వసంతకుమారి, ఏపీడీ అనూరాధ, ఏపీవో ప్రేమలత, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై సమగ్ర సర్వే చేయండి

పలాస, జూలై 25(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధులు, జ్వరాలపై సమగ్ర సర్వేచేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. శుక్రవారం సచివాలయ హెల్త్‌కార్య దర్శులతో సమావేశం నిర్వహించారు.

కుళాయిలు ప్రారంభం

పలాస, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మకోనేరు-నెహ్రూపార్కులో రిటైర్డ్ ఉపాధ్యాయుడు బమ్మిడి నాగేశ్వరరావు రూ.16 వేలతో కుళాయిలు, పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటిని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు శుక్రవారం ప్రారంభించారు కార్యక్రమంలో వాకర్స్ హనుమంతు మురళీమోహన్‌దొర, పి.రాజేంద్ర, బోయిన సత్యానంద్, ఆసుపత్రి సలహాకమిటీ డైరక్టర్ దడియాల నర్సింహులు, లక్ష్మణరావు, చాణుక్య, పలువురు వాకర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ బ్యాంక్ రుణాలు

ఇచ్ఛాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన స్వయంశక్తి సంఘాలకు స్టేట్‌బ్యాంక్ ద్వారా రుణాలందిస్తామని జిల్లా రీజినల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం సెర్ప్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎస్‌బీఐ, సెర్ప్ సిబ్బంది సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు నిరుపేద మహిళలకు అందించేందుకు సమన్వయంతో పనిచేయాల న్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.ప్రసాద్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాహు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సభ్యులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హరిపురం, జూలై25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీతోపాటు ఉద్దానం గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మద్దిల సంపతిరావు కోరారు. శుక్రవారం మందస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, కలరాతోపాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పెంటమ్మ, భారతి, హేమలత, శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుపై బాధితులు తక్షణమే స్పందించాలి

ఎల్.ఎన్.పేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన బాధితులు తక్షణమే స్పందించి దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాలకు 15 నిమిషాల్లో చేరుకుంటే 80శాతం ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని లక్ష్మీనర్సుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి పి. ప్రియాంక తెలిపారు. శుక్రవారం ఎల్.ఎన్.పేటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాముకాటువేసిన పావుగంటలో ఆస్పత్రికి తరలిస్తే శరీరంలోకి విషం సరఫరా ఆగిపోయేందుకు మందులు అందించి జిల్లా వైద్య ఆరోగ్యకేంద్రానికి పంపిస్తామని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఎచ్చెర్లను అభివృద్ధిలో నెంబర్-1 చేస్తా

● ఎమ్మెల్యే ఎన్ఈఆర్


నారాయణపురం కుడి కాలువకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

ఎచ్చెర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని నెంబర్-1గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. నవభారత్ జంక్షన్ వద్ద నారాయణపురం కుడి కాలువకు శుక్రవారం జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో నారాయణపురం కాలువ పూర్తిగా నిర్ల క్ష్యానికి గురైందన్నారు. ఇటీవల బుడగట్లపాలేనికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి కాలువ దుస్థితిని వివరించా మని, దీంతో ఆయన స్పందించి రూ.3 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో కాలు పొడవునా పూడికలు తొలగించి అభివృద్ధి చేశామన్నారు. ఈ కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలో సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు విష్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, పైడి అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివి: శంకర్



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొ న్నారు. నగరంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివస్‌ను శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు నిత్య స్మరణీయమన్నారు. త్వరలో సంక్షేమ భవనం నిర్మాణం పూర్తి కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.శైలజ, సంఘం చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, సంఘ ప్రతినిధులు బి.సూర్యనారాయణ, పి.మురళీధర రావు, సీహెచ్ రామారావు, విశ్రాంత కల్నల్ మెండ నారాయణ రావు, పి.చంద్రశేఖర్, జెజె.రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం తొలగించరు.. కొత్తది పూర్తి చేయరు

● ఇదీ కొమరల్తాడలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పరిస్థితి


కొమరల్తాడలో భవనం పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరల్తాడ అంగన్‌వాడీకేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది.శిథిలావస్థకు చేరిన భవనం తొలగించక పోవడంతో పాటు నిర్మాణంలోఉన్న భవనం పూర్తి చేయకపోవడం వల్ల కేంద్రం నిర్వహణకు అవస్థలు తప్పడం లేదు. జనావాసా ల్లో ఉన్న ఈభవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన నెలకొంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని పాత పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఆభవనం శ్లాబ్ పెచ్చులూడుతుండ డంతో పలుసార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో పాతభవనానికి సమీపంలో మరో భవనం నిర్మాణానికి పునాదుల వేసి ఏళ్లుగడుస్తోంది.ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాన్ని ఖాళీ చేయించి కనీసం అద్దె భవనంలో తరగతులు నిర్వహించాలని కోరుతున్నా అధికారులు చర్యతీసుకోవడంలేదని విద్యార్థులతల్లిదండ్రులు చెబుతున్నా రు. కాగా అధికారులు దృష్టికి ఎన్నిసార్లు ఈ సమస్య తీసుకువెళ్లినా స్పం దించడంలేదని సర్పంచ్ చింతరాజు తెలిపారు.మండల సమావేశాల్లోనూ అంగన్‌వాడీ కేంద్రం భవనం సమస్య ప్రస్తావించినట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: అశోక్


కరపత్రాలు అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఈ దిశలో సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. టి.బరంపురం పంచాయతీ శాసనాం గ్రామంలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సూపరిసిక్స్ హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పెది ని బాబ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, కార్యదర్శి దక్కత కామేష్, ఏఎంసీ చైర్మన్ బి.మణిచంద్ర ప్రకాష్, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, నేతలు సహదేవ్ రెడ్డి, దూపాన సూర్యనారాయణ, మేరుగు సూర్యనారాయణ, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


కంచిలి స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

కంచిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కంచమ్మతల్లి ఆటో యూనియన్, రైల్వే కన్సల్టింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్టేషన్ మాస్టర్ రాజేంద్ర పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్టేషన్‌లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికులు 2,3,4 ప్లాట్ ఫారాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందో తెలియడం లేదన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలువలు లేక.. మురుగు నీరు కదలక

● నరసన్నపేటలోని కలివరపుపేటలో తప్పని అవస్థలు


కలివరపుపేట రెండోవీధిలో రోడ్డుపైకి చేరిన మురుగు

నరసన్నపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని కలివరపుపేటలో గల రెండో వీధిలో మురుగునీరు రోడ్డుపై నిల్వఉండడంతో స్థానికులు ఇబ్బందులకు గుర వుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదతో మురుగు నీరు రోడ్డుపైకి చేరింది. కలివరపుపేటలో కాలువలు లేకపోవడంతో ము రుగురోడ్డుపైకి చేరింది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నా మని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

4 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, జూలై25(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఆగస్టు 4వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్ర దించాలన్నారు.

50 రోజులుగా అన్నదానం

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గడచిన 50 రోజులుగా అన్నదానం చేస్తూ ఓ క్రీడాకారుడు తన ఔదార్యాన్ని చాటుకుంటున్నాడు. స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రీడా పోషకుడు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. తనశక్తి కొలది అన్నప్రసాద వితరణ చేపడుతున్నా నన్నారు. శుక్రవారానికి 50 రోజులు పూర్తవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు నైట్ షెల్టర్‌లో పేదలు, బిక్షాటన చేసిన వారికి ఆకలి తీర్చడం మహా భాగ్యంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

జిల్లాకు అగ్నిమాపక శాఖ అదనపు డీజీ రాక

శ్రీకాకుళం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం రాత్రి జిల్లాకు వచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఎస్పీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయ గెస్ట్‌హౌస్‌లో ఆయన విశ్రాంతి తీసుకొని శనివారం మూల పోర్టు పోర్టును సందర్శించనున్నారు. అలాగే అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మోహన్‌రావు, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ శేషాద్రి ఆయనను మర్యా దపూర్వకంగా కలిశారు.

పారిశ్రామికవాడలో విద్యుత్ పనులు

పలాస, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంగిలిగాం పారిశ్రామికవాడలో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ పనులు ప్రారంభించారు. జీడిపప్పు ప్రాసెసింగ్‌లో విద్యుత్ కీలకం కాగా, రెండు నెలలుగా పారిశ్రామికవాడలో విద్యుత్ కోతల వల్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రూ.కోట్లలో నష్టం రావడంతో పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యవర్గసభ్యులు ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రం అందించడంతో పాటు సకాలంలో పనులు చేపట్టకపోతే పరిశ్రమలు బంద్ చేస్తామని వారికి తెలియజేశారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం పారిశ్రామికవాడలో పనులు ప్రారంభించారు. విద్యుత్ స్తంభాలు మార్చడంతో పాటు లైన్లు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు పూర్తి స్థాయిలో అందించాలి

హరిపురం, జూలై25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను పూర్తిస్థాయిలో అందించాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. మందస ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావుకు శుక్రవారం పీఆర్‌టీయూ నాయకులు కె.సాంబమూర్తి, కిషోర్ కుమార్, కొండల లెనిన్‌బాబు, ఈగాల శ్రీనివాస్, మురళి, ఉపేంద్ర, డిల్లీరావు, శేషగిరిరావు తదితరులు వినతిపత్రం అందజేశారు.